అందని జీరో బిల్లు గుండె గుభిల్లు

గృహజ్యోతి పథకం కింద జీరో కరెంటు బిల్లు కోసం వారు దరఖాస్తు చేశారు. తమకు అర్హత ఉన్నందున 'గ్యారంటీ'గా జీరో బిల్లు వస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఎదురుచూస్తున్న బిల్లు రానే వచ్చింది.. కానీ, అది జీరో బిల్లు కాదు. అది చూడగానే.. ఆ విద్యుత్ వినియోగదారుల గుండెలు గుభిల్లుమన్నాయి. తమకు జీరో బిల్లు ఎందుకు రాలేదో తెలుసుకునేందుకు, మళ్లీ దరఖాస్తు చేసేందుకు సంబంధిత కార్యాలయాల వద్ద బారులు తీరారు.

పాల్వంచ: మున్సిపల్ కార్యాలయంలో బారులు తీరిన వినియోగదారులు

పాల్వంచ, మార్చి 11: రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన గృహజ్యోతి పథకం కింద జీరో విద్యుత్ బిల్లులు రాకపోవడంతో పాల్వంచ పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయానికి భారీఎత్తున తరలివచ్చి మళ్లీ దరఖాస్తులు ఇస్తున్నారు. అర్హత ఉండి జీరో బిల్లు రాకపోతే నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ చెల్లింపుల కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు సూచించడంతో వినియోగదారులు పరుగులు పెడుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో గృహజ్యోతి దరఖాస్తుల ఆన్‌లైన్ కోసం కేవలం ఇద్దరు సిబ్బందిని కేటాయించడంతో జనం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడ్డారు. తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తిరిగి ఆన్‌లైన్ చేయించుకుంటే పథకాన్ని వర్తింపజేస్తామని ఏడీఈ లక్ష్మణ్ తెలిపారు.

ఇల్లెందు రూరల్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట బారులు తీరిన వినియోగదారులు

ఇల్లెందు రూరల్, మార్చి 11: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ప్రజలకు కష్టాలు తెచ్చి పెడుతోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రజలకు నిరాశే మిగులుతుంది. అందరికీ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో లబ్ధిదారులు కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. సోమవారం కొంత మందికి గృహజ్యోతి జీరో బిల్లు అమలుకాకపోవడంతో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. జీరో బిల్లుపై అధికారులను ప్రశ్నిస్తే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాలేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు. పరిపాలనలో ప్రజలందరికీ సమన్యాయం చేయాలే కానీ కొందరికి అమలు చేసి మరికొందరి పేర్లను నమోదు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై ఎంపీడీవో ధన్‌సింగ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం తాను సెలవులో ఉన్నానని, వచ్చాక సమస్యను తెలుసుకుంటానని అన్నారు. అమలు కాని వారి పేర్లను పరిశీలిస్తామని తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

ద్విచక్ర వాహనాలు, నిందితుడితో పోలీసులు

చర్ల, మార్చి 11: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో ద్విచక్ర వాహనాను దొంగిలిస్తున్న వ్యక్తిని చర్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలు.. మండలంలోని పైడిగూడెం గ్రామస్తుడు కణితి వెంకటేశ్వరరావు, కొంతకాలంగా ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తూ, ఇతర చోట్ల అమ్ముతున్నాడు. అతని నుంచి మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఇతనిపై ఇప్పటికే 20 కేసులు ఉన్నాయి. పీడీ యాక్ట్ కింద అరెస్టయి జైలు శిక్ష కూడా అనుభవించాడు. బయటకు వచ్చాక కూడా దొంగతనాలు చేస్తూ పట్టుబడ్డాడు.

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం

అశ్వారావుపేట, మార్చి 11: ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. పట్టణంలోని ఫైర్ కాలనీలో పొట్టేళ్ల పోలయ్య ఇంట్లో సోమవారం గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇంట్లోని రూ.80 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, బ్యాంకు డాక్యుమెంట్లు కాలి బూడిదైపోయాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.3 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేట, మార్చి 11: కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించిన పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామ సమీపంలో సోమవారం కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.1,500, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తుడిని హత్య చేసిన మావోలు

కొత్తగూడెం క్రైం, మార్చి 11: ఇన్‌ఫార్మర్ నెపంతో గ్రామస్తుడిని మావోయిస్టులు హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. బీజాపూర్ జిల్లా కుట్రూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పేట గ్రామానికి చెందిన వ్యక్తిని మూడు రోజుల క్రితం మావోయిస్టులు అపహరించారు. తర్వాత హత్య చేసి గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన అతడి మృతదేహాన్ని వదిలి వెళ్లారు. కాగా.. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఆ గ్రామస్తుడిని చంపినట్లు పోలీసులు ధ్రువీకరించారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు హతం

కొత్తగూడెం క్రైం/దుమ్ముగూడెం, మార్చి 11: బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీడియా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు హతమయ్యాడు. పీడియా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, కేంద్ర బలగాలు, సీఏఎఫ్ భద్రతా దళాలు గాలిస్తుండగా మావోయిస్టులు తారసపడి కా ల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరపడంతో మావోయిస్టులు పారిపోయారు. మావోయిస్టు మృత దేహంతోపాటు ఆయుధ, వస్తు సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి.

'సీతారామ' పనులను త్వరగా పూర్తి చేయాలి

ఇరిగేషన్ శాఖ సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 11 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్ట్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భద్రాచలంలోని మార్కెట్ యార్డులో సోమవారం ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్ట్ కాలువను జూలూరుపాడు మండలం నుంచి ఖమ్మం జిల్లా ఏన్కూరు పరిధిలోని ఎన్ఎస్ కెనాల్‌కు అనుసంధానం చేయాలన్నారు. అందుకు ప్రభుత్వం నుంచి రూ.97 కోట్లు కేటాయిస్తామన్నారు. భద్రాచలంలో కరకట్ట నిర్మాణానికి రూ. 30 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులను సత్వరం పూర్తయ్యేలా చూడాలన్నారు. అందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో పట్టణవాసులకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఆలయ అభివృద్ధిపై చర్చించి, అందుకు తగినన్ని నిధులు విడుదల చేస్తామని సీఎం అన్నారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులు రక్షణ సూత్రాలు పాటించాలి

రామవరం, మార్చి 11 : బొగ్గును క్రషర్‌లో వేసే సమయంలో తడిచేసి వేయడం వల్ల దుమ్ము, ధూళి లేచే అవకాశం ఉండదని, రక్షణ సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్) సత్యనారాయణరావు అన్నారు. సోమవారం సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్‌వోసీని జీఎం సీహెచ్‌పీలు నవీన్‌కుమార్, ఏజీఎం అండ్‌ఎం కేవీ రావు, కార్పొరేట్ ఎస్‌ఈ(ఈఅండ్‌ఎం) కేశవరావుతో కలిసి సందర్శించారు. సీహెచ్‌పీలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఆయన వెంట ఏరియా ఇంజినీర్ దుర్గాప్రసాద్, కిష్టారం ఓసీ పీవో నరసింహారావు, డీజీఎం సోమశేఖర్, జనరల్ షిఫ్టు ఇంజినీర్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న సత్యనారాయణరావు

సీఎంపీఎఫ్ క్లైయిమ్స్‌ను సెటిల్ చేయాలి

కొత్తగూడెం సింగరేణి, మార్చి 11 : బొగ్గుగని కార్మికులు, ఉద్యోగుల సీఎంపీఎఫ్ క్లెయిమ్స్‌ను త్వరితగతిన సెటిల్ చేసేందుకు సీ-డాక్ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన పోర్టల్‌లో ప్రతి ఉద్యోగి వివరాలను నమోదు చేయాలని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి అన్నారు. సోమవారం స్థానిక ఇల్లెందు క్లబ్‌లో జీఎం పర్సనల్ బసవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. క్లెయిమ్స్ ఆన్‌లైన్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎం పర్సనల్ హనుమంతరావు, జీఎం పర్సనల్ కవితానాయుడు, సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ, ఏజీఎం బెనడిక్ట్ నికోలస్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, సీఎంపీఎఫ్ అధికారులు బీఎల్ వెంకటేశ్వర్లు, సీతారామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగని పట్టుకున్న 'నమస్తే' విలేకరి

బాధితురాలికి ధైర్యం చెబుతున్న స్థానికులు

కొత్తగూడెం క్రైం, మార్చి 11: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును అపహరించి పారిపోతున్న దొంగను 'నమస్తే తెలంగాణ' విలేకరి పట్టుకొని తిరిగి ఆ గొలుసుని ఆమెకు అప్పగించిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకెళ్తే.. గాజులరాజం బస్తీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగురాలు భారతి సోమవారం పనిమీద బయటికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నది. సదరు మహిళ ఒంటరిగా ఉండడం గమనించిన ఓ దొంగ ఆమె మెడలోని మూడుతులాల బంగారు గొలుసును అపహరించి పారిపోయేందుకు యత్నించాడు. బాధితురాలు ఒక్కసారిగా కేకలు వేయడంతో ఆ సమయంలో అటుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న 'నమస్తే తెలంగాణ' విలేకరి కొట్టె శివశంకర్ దొంగను వెంబడించి చాకచక్యంగా పట్టుకున్నాడు. అతడి వద్ద ఉన్న గొలుసుని తిరిగి బాధితురాలికి అప్పగించాడు. ఆ దొంగను స్థానికుల సాయంతో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులకు అప్పగించారు. ధైర్యం దొంగను పట్టుకున్న శివశంకర్‌పై స్థానికులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

జెన్కో సీఎండీకి వినతి

పాల్వంచ, మార్చి 11 : హైదరాబాద్ విద్యుత్‌సౌధలో టీఎస్ ట్రాన్స్‌కో, టీఎస్ జెన్కో సీఎండీని ఎస్ఏఎం రిజ్వీని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్, రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెన్కో కార్యదర్శి చారుగుండ్ల రమేశ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎస్ జెన్కోలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, ఆర్టీజన్లు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. వైటీపీఎస్‌లో పనిచేస్తున్న ఓఅండ్‌ఎం కార్మికులను కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో సర్దుబాటు చేయాలని వినతిపత్రం అందించారు. వీటిపై అధికారులు సానుకూలంగా స్పందించారు. నూతన ఏఎస్పీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఏ.ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు ఇళ్ల స్థలాలు పంపిణీ

కొత్తగూడెం అర్బన్, మార్చి 11 : మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో ఉన్న నిరుపేదలకు ఈ నెల 12వ తేదీ మంగళవారం 75 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ వార్డులో జరిగే ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సుమిత్ర కల్యాణ్‌కు అవార్డు

అవార్డు అందుకున్న సుమిత్ర

కొత్తగూడెం అర్బన్, మార్చి 11: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లిరిక్ రైటర్ సుమిత్ర కల్యాణ్ కళాకార్ టీవీ వారు అందించిన 'ఉమెన్ ఐకాన్ 2024'లో బెస్టు లిరిక్ రైటర్ అవార్డు అందుకున్నది. కొత్తగూడెం హనుమాన్ బస్తీకి చెందిన కల్యాణ్ సుమిత్ర 200కు పైగా యూ ట్యూబ్ ఛానల్స్‌కు పాటలు అందించారు. ఆమెను పలువురు అభినందించారు

ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేట, మార్చి 11: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని నారాయణపురం సమీపంలోని పెదవాగు నుంచి కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. నిఘా వేసిన పోలీసులు అశ్వారావుపేట వద్ద పట్టుకుని సీజ్ చేశారు. కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై శ్రీరాముల శ్రీను తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దమ్మపేట, మార్చి 11: తాళం వేసినఇంట్లో నుంచి బంగారం ఆభరణాలు చోరీ చేసిన విషయంపై దమ్మపేట పోలీస్ స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపిన వివరాలు.. దమ్మపేటలోని బోసుబొమ్మ సెంటర్లో భూక్యా నాగేంద్రబాబు రెండు రోజుల క్రితం స్వగ్రామమైన ఏపీలోని టీ నరసాపురం మండలం, కిష్టాపురంలోని బంధువుల ఇంటికి కుటుంబంతో వెళ్లాడు. ఇంటి తాళం పగలకొట్టి 33 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించారు. సోమవారం ఇంటికి వచ్చిన నాగేంద్రబాబుకు బంగారం చోరీ అయినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసారు.

వేతనాలు పెంచాలని వినతి

మణుగూరు టౌన్, మార్చి11: సింగరేణి పరిధిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు సుప్రీం కోర్టు సూచనల ప్రకారం వేతనాలు పెంచాలని సోమవారం మణుగూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్మికుల వెంట ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ మణుగూరు బ్రాంచి నాయకులు సంజీవరెడ్డి, వి.జానయ్య, రవి పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యలపై వినతి

టేకులపల్లి, మార్చి 11: టిప్పర్, లారీ ఓనర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడు నేలవెల్లి నరసింహారావు ఆధ్వర్యంలో పలు సమస్యలపై కేవోసీ పీవో ప్రహ్లద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లారీల ఓనర్ల కమిటీ సభ్యులు కోరం సురేందర్, బోడ మంగీలాల్, అరవ వెంకటేష్, గోపి, బానోత్ రవి, గుర్రం రామారావు, మళోత్ మోహన్, బానోత్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సీఎం సభకు డ్వాక్రా మహిళలు

అశ్వారావుపేట, మార్చి 11: భద్రాచలంలో సోమవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు మండలం నుంచి రెండు బస్సుల్లో డ్వాక్రా మహిళలు, సెర్ప్ ఉద్యోగులు వెళ్లారు. ఎంపీడీ సీతారామరాజు, సెర్ప్ ఏపీఎం వెంకటేశ్వర్‌రెడ్డి మహిళలను భద్రాచలం పంపించారు.

ఆధునిక వ్యవసాయంపై నేడు అవగాహన

టేకులపల్లి, మార్చి 11: ప్రభుత్వం ఆధునిక వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, అందులో భాగంగా మంగళవారం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ రైతు వేదికలో అవగాహన కల్పించనున్నట్లు ఏవో అన్నపూర్ణ తెలిపారు. మండలానికి చెందిన రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఎల్‌వో పారితోషికం వెంటనే చెల్లించాలి

ఇల్లెందు రూరల్, మార్చి 11: బీఎల్‌వోల పారితోషికం వెంటనే చెల్లించాలని అంగన్ వాడీ టీచర్లు నిరసనకు దిగారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. బీఎల్‌వో డ్యూటీలు చేసిన బిల్లులు ఇంత వరకు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఈసం వెంకటమ్మ, ఫాతిమ, మరియ, కుమారి, సుజాత, అరుణ పాల్గొన్నారు.

తీర్థాల జాతర ఆదాయం రూ.38.68కోట్లు

ఖమ్మం రూరల్, మార్చి 11: తీర్థాల జాతరకు ఆదాయం మొత్తం రూ38.68కోట్లు వచ్చినట్లు ఆలయ ఈవో ఎన్ శేషయ్య సోమవారం తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 7నుంచి 11వరకు మండల పరిధిలోని తీర్థాల జాతరకు హుండీ ఆదాయం, వివిధ రూపాల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే 3,25 764 ఆదాయం అదనంగా సమకూరిందన్నారు. దేవాదయశాఖ పరిశీలకులు ఆర్ సమత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి

కూలీల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాల్వంచ రూరల్, మార్చి 11 : మండలంలోని పలు పంచాయతీల్లో గత రెండ్రోజులుగా ఉపాధి పనుల తనిఖీ జరుగుతున్నది. 2022-23 సంవత్సరంలో మండలంలో రూ.5 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి తనిఖీ బృందాలు మండలంలో గ్రామసభలు నిర్వహించి పనులు ఏమేరకు జరిగాయి, కూలీలకు వేతనాలు సక్రమంగా అందాయా, పనుల్లో అవకతవకలు ఏమైనా జరిగాయా అనే అంశాలను బృంద సభ్యులు కూలీలను అడిగి సమాచారం తెలుసుకుంటున్నారు. సోమవారం 12 పంచాయతీల్లో బృందాలు తనిఖీ నిర్వహించాయి. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీవో రంగా నాగారంలో జరిగే ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కనకదుర్గ, అబ్జర్వర్ దేవదాసు, కార్యదర్శులు మౌనిక, కృష్ణవేణి, సతీశ్, శంకర్ పాల్గొన్నారు.

చండ్రుగొండ, మార్చి 11: మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనులకు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అశోక్ సూచించారు. సోమవారం తిప్పనపల్లి, తుంగారం గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి కూలీల హాజరును తనిఖీ చేశారు. వేసవిలో కూలీలు ఎండవల్ల ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీవో రామచంద్రరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మెచ్చా పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట, మార్చి 11: దమ్మపేటలో కిరాణ వ్యాపారీ మాడా సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. సోమవారం దమ్మపేటలో జరిగిన సత్యనారాయణ దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ బాబు, ఎంపీటీసీ దేవరపల్లి అజయ్‌కుమార్, జిన్నా, రూపా రాంబాబు ఉన్నారు.

అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

దమ్మపేట, మార్చి 11: మండలంలోని ముష్టిబండ చెరువు పక్కన ప్రతిష్ఠించిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు రావు జోగేశ్వర రావు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

అశ్వారావుపేట రూరల్, మార్చి 11: మండలంలోని ఆసుపాక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉపాధి నర్సరీని ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా మొక్కలు చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మోతీలాల్‌కు సూచించారు. మొక్కలకు ట్యాంక్ ద్వారా నీరు పెట్టాలని సిబ్బందితో చెప్పారు.

ఉద్యోగస్తుల ఇంక్రిమెంట్ తనిఖీ

ఇల్లెందు రూరల్, మార్చి 11: ఉద్యోగుల అన్యువల్ ఇంక్రిమెంట్‌ను ఆడిట్ బృందం తనిఖీ నిర్వహించారు. సోమవారం ఏరియాలోని వైసీవోఏ క్లబ్‌లో మార్చి నెల అర్హతను అనుసరించి ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌ను అప్‌డేషన్ చేశారు. ఆడిట్ డిపార్ట్‌మెంట్ ఏజీఎం ఫైనాన్స్, ఇంటర్నల్ ఆడిట్ సిబ్బంది మాట్లాడుతూ.. 385 మంది ఉద్యోగుల బేసిక్ అప్‌డేషన్ ప్రపోజల్‌ను ఆడిటింగ్ చేశామన్నారు. డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలి

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తగూడెం అర్బన్, మార్చి 11: ఎస్‌బీఐ, మోడీ భాగోతాలు బయటపెట్టాలని, సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీధర్, రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేశ్, లక్ష్మీదేవిపల్లి సీపీఎం మండల కార్యదర్శి ఉప్పరపల్లి నాగేశ్వరరావు, వీరన్న, లక్ష్మీ, వెంకన్న, రమేశ్, రాజు, రాజారావు, బాబు, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాములు, రఘు, రమ, సంధ్య, నాగమణి పాల్గొన్నారు.

చండ్రుగొండలో...

ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

చండ్రుగొండ, మార్చి11: ఎలక్టోరల్ బాండ్లను ఎస్‌బీఐ వెంటనే బహిర్గతం చేయాలని సీపీఎం నాయకులు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్లను ఏ రాజకీయ పార్టీకి ఎంత ఇచ్చారో వెంటనే బహిర్గతం చేయాలన్నారు. బీజేపీ చెప్పుచేతల్లో జాతీయ బ్యాంకులు ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన బ్యాంకుల తీరు మారకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిని వేణు, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాయి రాజా, రాముడుగు వెంకటాచారి, చల్లపల్లి రాజా, కాంతారావు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

న్యాయవాది లక్ష్మీనారాయణ మృతికి సంతాపం

మణుగూరు టౌన్, మార్చి11: మణుగూరుకు చెందిన సీనియర్ న్యాయవాది బొల్లేపల్లి లక్ష్మీనారాయణ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతిపై మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో లక్ష్మీనారాయణ మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం విధులకు దూరంగా ఉన్నారు. సంతాపం తెలిపిన వారిలో న్యాయవాదులు చిర్ర రవికుమార్, కందిమళ్ల నర్సింహారావు, రామ్మోహన్‌రావు, కుర్మా విజయారావు, పోశం భాస్కర్, నగేశ్‌కుమార్, సావిత్రి, కవిత, పద్మావతి, వాసవి, సంధ్య, సర్వేశ్వరరావు ఉన్నారు.

కొత్తగూడెం టౌన్, మార్చి 11 : ఫుల్‌కోర్టు రిఫరెన్స్ అనంతరం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది బొల్లేపల్లి లక్ష్మీనారాయణ సంతాప సభ జరిగింది. పలువురు న్యాయవాదులు సంతాపం తెలిపారు. న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చాని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండో అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయిశ్రీ, మూడో అదనపు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్, బార్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సింగరేణిలో మహిళాదినోత్సవం

కొత్తగూడెం సింగరేణి, మార్చి 11 : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఉమెన్‌సెల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు, సిబ్బంది ఆటపాటలతో సందడి చేశారు. జీఎం పర్సనల్ కవితానాయుడు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కన్వీనర్, జీఎం పర్సనల్ బసవయ్య, విశిష్ట అతిథిగా వై.సరస్వతి బసవయ్య, ప్రముఖ నాట్యగురువు సీతాప్రసాద్ పాల్గొన్నారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ పీవో టి.శ్రీనివాసరావు, ఉమెన్స్‌డే ఆర్గనైజర్స్ కిరణ్మయి, సుమలత, శారద పాల్గొన్నారు.

రామవరం, మార్చి 11 : సింగరేణి సేవా సమితి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. రుద్రంపూర్‌లోని ఆర్‌సీవోఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం షాలెంరాజు, ఏరియా సేవా అధ్యక్షురాలు మధురవాణి శాలెంరాజు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, డాక్టర్ రేపాక సాత్విక పాల్గొని మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, డీజీఎం యోహాన్, శ్రావణ్‌కుమార్, కోఆర్డినేటర్ సాగర్, సెక్రటరీలు అనీత, భూలక్ష్మి, ఆదిలక్ష్మి, మాధవి, ఎంపీటీసీలు ఆర్తీ మక్కడ్, నాగమణి, ఫాతిమా రజాక్ పాల్గొన్నారు.

రంజాన్ ఆగయా

రామవరం, మార్చి 11 : నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిధిలోని మసీదుల్లో సైరన్‌లను మోగించారు. ఒకరికిఒకరు చాంద్ ముబారక్(నెలవంక) దర్శనం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ మాసంలో ఇషానమాజ్ తరువాత ప్రత్యేక తరవీహ్ నమజ్‌లు ప్రారంభమయ్యాయి. ముస్లిం ఇళ్లల్లో రంజాన్ సందడి మొదలైంది. మంగళవారం సహర్‌తో ఉపవాసాలు(రోజా) ప్రారంభమయ్యాయి. అందుకోసం ముందస్తుగానే పాలు వివిధ రకాల తిను పదార్థాలను నిల్వ చేసుకున్నారు. రంజాన్ మాసం 30వ రోజు ఉపవాస చివరిరోజున షవ్వాల్ మాసం నెలవంకను చూసి తెల్లవారాక ఈద్-ఉల్ -ఫిత్ర్ (రంజాన్) పండుగను జరుపుకోనున్నారు.

నాలుగో మూలస్తంభం ఉపవాసం(రోజా)

ఇస్లాం నాలుగో మూల స్తంభం ఉపవాసం. ఉపవాసాన్ని అరబ్బి భాష ఇస్లాం ధర్మశాస్త్ర పరిభాషలో 'సౌమ్' అంటారు. ఉపవాసం అంటే అలాహ్ ప్రసన్నత కోసం అల్లా ఆరాధన ఉద్దేశంతో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానాలకు దూరంగా ఉండడంతోపాటు ఉపవాసంనకు బంగపర్చు కార్యాలన్నింటిని విడనాడడం. ఉపవాసాలను ముస్లింలకు ఫర్జ్(విధి)గా నిర్ణయించబడింది. ధర్మపరమైన కారణాలు లేకుండా ఉపవాసాలు పాటించనట్లైతే అతను ఫాసిఖ్ దురాచారి అవుతాడని హదీస్ ద్వారా చెప్పబడుతున్నది.